క్లుప్తంగా

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

కమలాపురం : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని జూన్ 6వ తేదీ వరకు ఈ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కోడ్ అమల్లో ఉన్నప్పుడు సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరవి చేయాలంటే తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే ఇవన్నీ చేసే సమయంలో టపాసులు కాల్చడం పూర్తిగా నిషిద్ధం అన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలీసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఈనెల 28వ తేదీనుంచి ప్రారంభం కానున్నట్లు సే వాసమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. గ్రామీణ, ప ట్టణ ప్రాంతాలలో 10వ తరగతి పరీక్షలు రాసి ఉ న్నత చదువుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఎస్‌వి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ అ ధికారి మహేశ్వరరెడ్డి, శ్రీదేవి, సుబ్బిరెడ్డిలతో కలసి విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సామూహిక లక్ష్మీపూజ

వల్లూరు : మండలంలోని మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం సామూహిక లక్ష్మీపూజ కార్యక్రమం సాంప్రదాయ బద్దంగా జరి గింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం వేద పండితులు పసుపు ముద్దలతో లక్ష్మీదేవి ప్రతిమలను చేసి దీపాలను వెలిగించి మహిళలచే కుంకుమార్చనను నిర్వహించారు. స్వా మివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఉ దయం వేద పండితుల ఆధ్వర్యంలో మూల మంత్ర, నవగ్రహ జపాలను, వివిధ హోమాలను వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి జరిగిన తాళం భజన పోటీ లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉదయం ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరిగాయి.

వైభవంగా కోట పోలేరమ్మ తిరునాల

పోరుమామిళ్ల: పట్టణంలోని రంపాడురోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరుణాల మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ముగింపు రోజున ఆదివారం బలిజ కోట నుంచి అమ్మవారి పుట్టింటి వారు కుంకుమబండి కట్టి ఊరేగింపుగా రంపాడురోడ్డులోని కోట పోలేరమ్మ దేవస్థానానికి వచ్చారు. భక్తులు కోళ్లు, మేకపోతులు తీసుకుని మేళతాళాల మధ్య రంగులు చల్లుకుంటూ వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచే వేలాదిమంది భక్తులతో ఆలయం కిటకిట లాడింది. కొందరు తలనీలాలు సమర్పించుకున్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

మైదుకూరు: ఓటుతోనే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవచ్చునని వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని భూమాయపల్లెలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా సమాజ సేవ అంశంపై శిబిరం నిర్వహిస్తున్నారు. చివరి రోజున ఆదివారం ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటు అత్యంత విలువైందన్నారు. ఎన్ఎస్ఎస్ చదువులో ఒక భాగమన్నారు. అనంతరం 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు రాధా రామ్, శివశంకర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగులకు జిల్లా జడ్జి ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన న్యాయశాఖ ఉద్యోగులతో జిల్లా జడ్జి శ్రీదేవి

కడప అర్బన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని న్యాయశాఖలోని ఉద్యోగులకు ఆదివారం సాయంత్రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి కట్టుగా ఉండేందుకు ఇలాంటి పండుగలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా జడ్జి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టీవీఎం కృష్ణారావు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టల ఆదివారం కార్యక్రమంలో పాస్టర్, ప్రతినిధులు



చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప కల్చరల్ : క్రైస్తవలోకం అత్యంత పవిత్రమైనదిగా భావించే గుడ్ ఫ్రైడేలో భాగంగా ఆదివారం మట్టల ఆదివారం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా భావిస్తారు. ఈ సందర్భంగా చర్చిలలోని భక్తులు ఆయా చర్చిల గురువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం చర్చిలో ప్రదక్షిణలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా లేత ఈత మట్టలను ధరించి బాధాతప్త హృదయాలతో క్రీస్తు గురించి ప్రార్థన చేస్తారు. ఈ సందర్భంగా కడప నగరం సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో పాస్టర్ మత్తయ్యబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి నిర్వహణ కమిటీ ప్రతినిధులు మనోహర్‌బాబు, డేనియల్ తదితరుల పర్యవేక్షణలో క్రైస్తవ భక్తులు ఈత మట్టలను చేతబూని క్రీస్తు స్తుతి గీతాలను ఆలపిస్తూ చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మట్టల ఆదివారం ప్రత్యేకత గురించి, గుడ్‌ఫ్రైడే విశేషాలను తెలియజేశారు.

- కడప మాసాపేట సెయింట్‌జాన్ చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె సహాయం ఆధ్వర్యంలో మట్టల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ శుక్రవారం పవిత్ర వారమని అందులోని మొదటి రోజు ఆదివారం మట్టల ఆదివారంగా, శ్రమల ప్రారంభ ఆదివారంగా కొనియాడుతారన్నారు. అందులో భాగంగానే మట్టలను చేబూని పురవీధుల మీదుగా ప్రభువైన క్రీస్తుకు జేజేలు పలుకుతారన్నారు.
- స్థానిక బుడగజంగం కాలనీలోని న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో పాస్టర్ మహేష్ ఆ. ధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్టల ఆదివారం ప్రత్యేకత, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సండేల గురించి వివరించారు.

ప్రకృతిని కాపాడుకోకుంటే మనుగడ కష్టం



హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్న ఇంటాక్ సంస్థ ప్రతినిధులు, నగర ప్రముఖులు

కడప కల్చరల్ : ప్రకృతిని కాపాడుకోకుంటే మానవాళికి మనుగడ కష్టమేనని భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఆదివారం ఇంటాక్ జిల్లా చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక పాలకొండల వద్ద గల నగరవనంలో సంస్థ సభ్యులు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కరువులు, నీటి ఎద్దడి ప్రకృతిని నిర్లక్ష్యం చేసినందుకు ఫలితమేనన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు ఈ వాక్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పూర్వం దైవ క్షేత్రాలన్నీ అడవుల్లోనే ఏర్పాటు చేయడం వెనుక ప్రకృతికి దగ్గరగా ఉండేందుకేనన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ నదులు, అడవులు లాంటి సహజ వనరులను కాపాడుకునేందుకు పూర్వం ఉత్సవాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. అనంతరం వారు జెండా ఊపి హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులంతా నగర వనంలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ప్రకృతిని కాపాడాలంటూ నినాదాలు చేస్తూ నడక నిర్వహించారు. అనంతరం ప్రకృతిని పరిరక్షించుకోవడంలో భాగంగా ఇంటాక్ చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కొండూరు జనార్ధనరాజు, భారవి, ఇంటాక్ జిల్లా కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, ఎల్ఐసీ రఘునాథరెడ్డి, యల్లేశ్వరరావు, నాగవేణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18–26 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులకు శిక్షణకు అర్హులన్నారు. 35 రోజులపాటు ఇచ్చే శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో ఉచితంగా శిక్షణా ఇస్తామన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయ్యాక వివిధ సంస్థల్లో రూ.15 వేలకుపైగా వేతనంతో ఉపాధి చూపడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

డ్యాన్స్.. అదుర్స్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక విజిల్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ టైప్‌రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సంస్థ మనుగడ, విజయసాధన తదితర అంశాల గురించి పలు సూచనలు చేశారు. సంస్థ అధ్యక్షులు ఇ.శ్రీరాములు, కార్యదర్శి ఏజీకే మూర్తి, గౌరవాధ్యక్షులు సీవీ మోహన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుభాని, కోశాధికారి నరసింహులు మాట్లాడారు. సంస్థ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ, కార్యదర్శి నవీన్‌కుమార్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అతిథులు ఇటీవల టైప్‌రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

బంజారా సంప్రదాయ పద్ధతిలో హోలీ



కట్టెలు వెలిగిస్తున్న బంజారా నాయకులు

కడప కార్పొరేషన్ : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట స్వామి ఆధ్వర్యంలో హోలీ పండుగ బంజారా సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రిమ్స్ సమీపంలోని గిరిజన భవన్‌లో దాదాపు 700 మంది బంజారాలు ఈ కార్యక్రమంలో పాల్గొని కట్టెలు వెలిగించి నవ ధాన్యాలతో కుంకుమ రంగు, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అందరూ బంజారా దుస్తులు వేసుకొని రుచికరమైన విందు ఆరగించి, రంగులు చల్లుకొని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఆనంద్‌నాయక్, ఠాగూర్ నాయక్, డాక్టర్ శివానాయక్, వేణుగోపాల్ నాయక్, క్రిష్టా నాయక్, శ్రీనివాస్ నాయక్, బీడీ నాయక్, జగన్ నాయక్, సావిత్రీబాయ్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీరాం నగర్‌లో ఆదివారం సాయంత్రం మహిళలు, పిల్లలు హోలీ సంబరాలు జరుపుకొన్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ, హోలీ హోలీరే అంటూ నినాదాలు చేశారు. మహిళలు నృత్యాలు చేస్తూ ఆనందంగా పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ఆదరించాలి



నూతన జంటను అభినందిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరంలోని సియాన్‌పురం బాలజోజీ, వాడాల పరిమళమ్మ కుమారుడు సందీప్ కుమార్, విజయనగరం టౌన్ మహాలక్ష్మి నగర్ ఉప్పాడ సింహాచలం, ఉప్పాడ కళ్యాణి గార్ల కుమార్తె చాందిని గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకొని వివాహం చేసుకోవాలని పెద్దల దృష్టికి తీసుకురావడంతో అబ్బాయి తల్లిదండ్రులు వీరి వివాహం జరిపించాలని సీపీఐ నాయకులను ఆశ్రయించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీబాదుల్లాల్ ఆదివారం సాయంత్రం హోచిమిన్ భవన్‌లో ఆదర్శ వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ సమాజంలో మార్పు కోరుకునే ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆర్భాటాలు లేని ఆదర్శ వివాహాలు చేసుకున్న జంటలను ఆదరించి అభినందించాలన్నారు. అలాగే మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా ఇలాంటి వివాహాలు చేసుకున్న జంటలను ప్రత్యేకంగా అభినందించి, ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలన్నారు. ప్రేమ వివాహాలు గొప్పకాదని, ఆదర్శంగా జీవించి సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల కోసం ఐక్యంగా సాగుదాం



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : సమాజంలో పేద, బడుగు వర్గాలు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన ప్రజలకు సేవలు అందించేందుకు లయన్స్ క్లబ్‌లోని అన్ని శాఖలు సమీప జిల్లా శాఖలతో కలిసి ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ప్రాంతీయ సమావేశం ఆదివారం కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులంతా ఐక్యంగా ఒకేతాటిపై నిలిచి ప్రజలకు సేవలు అందించడంలో ముందుకు సాగాలని సూచించారు. మరో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామచంద్ర ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఏటా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఒక్కొక్క సభ్యునికి నాయకుడిగా అవకాశం ఇవ్వాలని సూచించారు. లయన్స్ క్లబ్ జిల్లాశాఖ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు మాట్లాడుతూ సభ్యులంతా సేవలు అందించే అంశంలో ఒకరినొకరు సహకరించుకోవాలని సూచించారు. నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను సామాజిక సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గూడూరు వాసి పాస్ట్‌జోన్ చైర్మన్ పి.మురళీకృష్ణ నాయుడు కూడా ఆయనను బలపరిచారు. కార్యక్రమంలో రాయచోటికి చెందిన డాక్టర్ హరినాథరెడ్డి, పాస్ట్ క్యాబినెట్ సెక్రటరీ సుబ్రమణ్యం, రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందులతోపాటు స్థానిక లయన్స్ సభ్యులు పాల్గొని ఏప్రిల్ 14న నెల్లూరులో జరగనున్న లయన్స్ క్లబ్ ఎన్నికల్లో తప్పక పాల్గొనాలని నిర్ణయించారు.

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : శబరిమల హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి జన్మ దినాన్ని పురస్కరించుకుని సోమవారం పార్నపల్లె రోడ్డులోని కోతి సమాధి ఆలయం వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, 6.30 గంటలకు తీర్థప్రసాదాల వినియోగం ప్రత్యేక అలంకారాలతో పాటు విశేష పూజలు ఉంటాయన్నారు. అలాగే సాయంత్రం అయ్యప్ప, ఆంజనేయస్వామి భజన మండలి వారిచే తాళాల భజనలు నిర్వహించి భక్తులకు అల్పాహారవిందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తరించాలని ఆయన కోరారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రొద్దుటూరు క్రైం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని త్రీటౌన్ సీఐ వెంకట రమణ తెలిపారు. రాజీవ్ సర్కిల్, ఎర్రన్న కొట్టాలు, భగత్‌సింగ్ కాలనీ, ఆచార్ల కాలనీ, మార్కెట్ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కేంద్ర పోలీసు సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి



మాట్లాడుతున్న అఖిల భారత అభ్యుదయ వేదిక నాయకుడు కె. సురేష్‌బాబు

వైవీయూ : త్వరలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను చిత్తశుద్ధితో అమలు చేయాలని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు కె.సురేష్‌బాబు కోరారు. ఆదివారం కడప నగరంలోని అఖిల భారత అభ్యుదయ వేదిక జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా ఎన్నికల నిబంధనలను అమలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ సీ విజిల్ యాప్‌ను ఉపయోగించుకుని తమ దృష్టికి వచ్చిన ఉల్లంఘనలపై చర్యలు చేపట్టాలన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ, శంకరయ్య మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు రావడం తీవ్రమైన విషయమని, ఉద్యోగులు చట్టప్రకారం వ్యవహరించాలే తప్ప సొంత అభిప్రాయాలు సరికాదన్నారు. ఎన్నికల సమయంలో స్వచ్ఛంద సంస్థలు ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వేదిక సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

బహుముఖ ప్రతిభామూర్తి కోడూరు ప్రభాకరరెడ్డి



హయగ్రీవాచార్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : డాక్టర్ కోడూరు ప్రభాకరరెడ్డి బహుముఖ ప్రతిభామూర్తి అని, కవిగా, విమర్శకుడిగా, బాలసాహిత్యకర్తగా, నాటకకర్తగా, నిఘంటుకర్తగా, వ్యాఖ్యాతగా, అనువాదకులుగా ఆయన చేసిన సాహిత్యసేవ చాలా గొప్పదని ప్రముఖ ప్రవచనకర్త, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న ‘నెలనెలా సీమ సాహిత్యం’ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 130వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ‘డాక్టర్ కోడూరు ప్రభాకరరెడ్డి జీవితం–సాహిత్యం’ అనే అంశంపై ప్రసంగించారు. ఆయన బహుముఖ రచనా విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. ఆయన రచనల ప్రత్యేకతను తెలిపారు. ఒక్కొక్క కావ్యంలోని ప్రత్యేకత, అందులోని ముఖ్య ఘట్టాలను వివరించారు. ప్రభాకరరెడ్డి రచనలు ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయని, పల్నాటి భారతం ఆంగ్లంలోకి, సంస్కృతంలోకి అనువదించారన్నారు. ఆయన పలు ప్రముఖ ఆంగ్ల రచనలను తెనిగించారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావులు వక్తను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

వైవీయూ : ప్రత్యేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు పదో తరగతి మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు అలీఖాన్, ఈశ్వరచంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారులతో మాట్లాడుతూ చిన్నపిల్లల సంరక్షణ ఉన్న, పిల్లల ఆరోగ్య బాధ్యతల ఉన్నవారు, గర్భవతులు, వ్యాధిగ్రస్తులు, వికలాంగులు, 55 ఏళ్ల దాటిన వారికి మినహాయింపులు ఇవ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలను కల్పించాలని కోరారు. మూల్యాంకనం విధులు పూర్తయిన వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని విన్నవించారు.

కల్యాణ మండపం డెకరేషన్‌కు టెండర్ల ఆహ్వానం

కడప అర్బన్ : కడప నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపానికి సంబంధించి డెకరేటర్ల నుంచి దరఖాస్తులను ఈ నెల 29 వరకు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2024–25 సంవత్సరానికి గాను ఈ టెండర్స్ ‘పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్’లో ఈ నెల 22 నుంచి తీసుకుంటున్నారన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టెండర్ బాక్స్‌లో రహస్య టెండర్ సీల్డ్ కవర్స్ వేయాలన్నారు. ఈ టెండర్స్‌లో డెకరేషన్ కాంట్రాక్టర్స్ కనపరిచిన మొత్తం అమౌంట్ కల్యాణ మండపం కమిటీ మెంబర్స్‌కు అంగీకారమవ్వాలన్నారు. అట్లు లేనియెడల సదరు టెండర్స్ రద్దు పరచి మార్చి 30వ తేదీన ఉదయం 10 గంటలకు కడప జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఇఫ్తార్ విందులో సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా



ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్‌యాదవ్

కడప కార్పొరేషన్ : రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందు హిందూ, ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని 2వ డివిజన్ తిలక్ నగర్‌లోని రహమతుల్లా మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 30 రోజులపాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడుతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తారన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధాన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలు పెంపొందిస్తాయన్నారు. అందుకే ముస్లిం మైనార్టీలు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. రంజాన్ పవిత్రతను గుర్తించి అల్లాహ్ అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, షఫీ, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కోలాకొండయ్య, రామక్రిష్ణ, మోహన్, గౌస్‌పీర్, మౌలా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

కమలాపురం : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లిం సోదరులకు ఉపవాసాలు విడిచే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి కమలాపురంలోని పెద్ద దర్గాలో వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. అంతకు ముందు దర్గా–ఏ–గఫారియా, జహీరియాలో స్వాముల వారి మజార్లపై పూల చా దర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతి ఏటా రంజాన్ మాసంలో ఏర్పాటు చే సే ఇఫ్తార్ విందుకు తాము రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే రాష్ట్రం అంతా చల్లగా ఉండాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనంతా అవినీతి, కరువులతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి, గౌస్‌పాక్, జి యా, సర్ఫరాజ్, నాయకులు పాల్గొన్నారు.